

రూ.30 కోట్లతో రోడ్ల అభివృద్ధి

ఆర్అండ్బి డిఇ బాబూరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్అండ్బి నూజివీడు డివిజన్ పరిధిలో రూ.30 కోట్ల వ్యయంతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆ శాఖ డివిజనల్ ఇంజినీర్ బాబూరావు తెలిపారు. నూజివీడులో ఆయన మంగళవారం మాట్లాడుతూ తాత్కాలిక ప్రాతిపదికన 20 పనులను రూ.మూడు కోట్ల వ్యయంతో పూర్తి చేసినట్లు తెలిపారు. అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఏడు పనులను రూ.2.22 కోట్లతో పూర్తి చేశామన్నారు. ప్యాచ్ వర్క్ల కింద 20 పనులను రూ.5.05 కోట్లతో పూర్తి చేసినట్లు తెలిపారు. జంగిల్ క్లియరెన్స్ కింద రెండు పనులను రూ.12 లక్షలతో పూర్తి చేశామన్నారు. శాశ్వత ప్రాతిపదికన రెండు పనులను రూ.2.50 కోట్లతో పూర్తి చేసినట్లు చెప్పారు. వివిధ దశల్లో నాలుగు పనులు సుమారు రూ.2.50 కోట్లతో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

కాళ్లు మొక్కుతూ.. న్యాయం కోరుతూ..!

తొలిరోజు కొల్లేరులో పర్యటించిన కేంద్ర సాధికారిక కమిటీ

వేలాది మంది కొల్లేరువాసులు రోడ్లపైకి వచ్చి న్యాయం చేయాలని వేడుకోలు

కమిటీ సభ్యుల కాళ్లపై పడి న్యాయం చేయాలని కన్నీటి పర్యంతం

కొల్లేటికోట గ్రామంలో సభకు పోటెత్తిన జనం

కమిటీకి సమస్యలు వివరించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎంఎల్ఎలు, ప్రజాసంఘాలు, ప్రజలు

మూడో కాంటూరుకు కుదించాలని, జిరాయితీ, సొసైటీ భూములు ఇవ్వాలని విన్నపం

నేడు రెండో రోజు కొనసాగనున్న కమిటీ పర్యటన



కొల్లేటికోట సభలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, దెందులూరు, ఏలూరు సిటీ

కొల్లేరు అధ్యయనానికి వచ్చిన కేంద్ర సాధికారిక కమిటీ సభ్యుల కాళ్లపై పడి తమకు న్యాయం చేయాలని కొల్లేరు ప్రజలు వేడుకున్నారు. జిరాయితీ భూములు, ప్రభుత్వం ఇచ్చిన సొసైటీ భూముల్లో చెరువులను ధ్వంసం చేశారని, ఉపాధి పోయి రోడ్డున పడ్డామని, రోడ్లతోపాటు ఏఒక్క అభివృద్ధి పనీ చేయకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడంతో తమ పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని సాధికారిక కమిటీ సభ్యుల వద్ద కొల్లేరు ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీ రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం దెందులూరు, కైకలూరు నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో సాధికారిక కమిటీ చంద్రప్రకాష్ గోయల్, డాక్టర్ జెఆర్.భట్, జి.భానుమతి, సునీల్లిమాయే బృందం పర్యటించింది. విజయవాడ నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు ఏలూరు చేరుకున్న కమిటీ భోజనం అనంతరం కొల్లేరు గ్రామాలైన శ్రీపర్రు, కలకుర్రు, పెద్దఎడ్లగాడ, కైకలూరు మీదుగా ఆటపాక, కొల్లేటికోట గ్రామాల్లో పర్యటించింది. వారి వెంట జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పి కె.ప్రతాప్ శివకిషోర్, ఎంఎల్ఎలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. కొల్లేటికోటలో జరిగిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎంఎల్సి జయమంగళ వెంకటరమణ, ఇతర నాయకులు పాల్గొన్నారు. కమిటీ వస్తుందని తెలిసి కొల్లేరు గ్రామాల ప్రజలంతా పెద్దఎత్తున రోడ్లపైకి, కొల్లేటి కోట సభకు తరలొచ్చారు. శ్రీపర్రులో పెద్దఎత్తున మహిళలు, గ్రామస్తులు కమిటీ కోసం వేచిచూశారు. అయితే కమిటీ సభ్యులు వారిని పలకరించి ఏమీ మాట్లాడకుండానే వెళ్లిపోయారు. ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ మీ సమస్యలన్నీ కమిటీకి వివరించామన్నారు. అనంతరం కలకుర్రు గ్రామానికి కమిటీ వెళ్లింది. మధ్యలో కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడే మ్యాప్ పాయింట్ ద్వారా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల కొల్లేరు గ్రామస్తులు కమిటీ సభ్యుల వద్ద మాట్లాడుతూ కొల్లేరు లంక గ్రామాల్లో రహదారులు లేక రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొల్లేరు ఆపరేషన్ అనంతరం తమ జీవనం దుర్భరంగా మారిందని, పిల్లా పాపలతో వలసలు పోవాల్సి వస్తుందని తెలిపారు. పర్యావరణానికి, పక్షులకు ఆటంకం కలగకుండా కొల్లేరులో అదనంగా కొట్టివేసిన సొసైటీ, జిరాయతీ భూములను తిరిగి పునరుద్ధరించి ఆదుకోవాలని వారు కమిటీని వేడుకున్నారు. కొల్లేటికోటలో జరిగిన బహిరంగ సభలో ప్రజాప్రతినిధులంతా కొల్లేరు ప్రజల ఇబ్బందులను కమిటీకి వివరించారు. సిపిఎంతోపాటు వివిధ ప్రజాసంఘాలు, పలు గ్రామాల నుంచి వచ్చిన వారంతా దాదాపు 45 వినతులను కమిటీకి అందించారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, జిరాయితీ, సొసైటీ భూములను అప్పగించాలని కోరారు. రెండో రోజు బుధవారం ఉంగుటూరు నియోజకవర్గంలో కమిటీ పర్యటించనుంది.



హాజరైన కొల్లేరు ప్రజలు

కొల్లేరు ప్రజల సమస్యలను కమిటీకి హిందీలో వివరించిన చింతమనేని కుమార్తె నవ్య

కలకుర్రు గ్రామానికి వెళ్లే రోడ్డులో ఆగి కొల్లేరు చెరువులను కమిటీ పరిశీలించింది. అక్కడి ప్రజల జీవన విధానం, అభయారణ్యం పరిధి, ప్రస్తుతమున్న పరిస్థితులను చీఫ్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎకె.నాయక్ కమిటీకి వివరించారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ కల్పించుకుని చేపల సాగు ఆవశ్యకత, వెంగళరావు ప్రభుత్వం చెరువులు తవ్వించడం, ప్రస్తుతం ప్రజల ఇబ్బందులు, సంప్రదాయం పేరిట అటవీ శాఖ అధికారులు పెడుతున్న ఇబ్బందులను పొడిపొడి ఆంగ్ల పదాలతో వారికి వివరించే ప్రయత్నం చేశారు. కమిటీ సభ్యులు హిందీలో మాట్లాడుతుండటంతో చింతమనేని కుమార్తె నవ్య అక్కడికి చేరుకుని ప్రజల జీవన విధానం, చేపల సాగుకు ఎదురవుతున్న ఇబ్బందులు, సాగుదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అటవీ అధికారులు సృష్టిస్తున్న అడ్డంకులను కమిటీకి హిందీలో వివరించారు. దీనిపై కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిఒ 120 ప్రకారం అభయారణ్య పరిధిలో సహజ, సంప్రదాయ పద్ధతిలోనే సాగు సాగాలన్నారు. చింతమనేని కుమార్తె మాట్లాడుతూ సంప్రదాయం పేరిట సాగు చేస్తే బ్యాంకులు రుణాలు ఇవ్వవని, దానివల్ల భూములున్న వారు కూడా పేదలుగా మిగిలిపోతున్నారని చెప్పారు. కలెక్టర్లా భలే వివరించావని, యంగ్ కలెక్టర్ అంటూ చింతమనేని కుమార్తెను కమిటీ సభ్యులు అభినందించారు.

సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పిస్తాం

తొలిరోజు కొల్లేరు ప్రాంతంలో పర్యటించిన కేంద్ర సాధికారిక బృందం రాత్రి ఎనిమిది గంటలకు ఏలూరు కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరానికి చేరుకుంది. పలువురు కొల్లేరు గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కొల్లేరులో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఎంఎల్ఎలు, కేంద్రమంత్రి సమస్యలను వివరించారన్నారు. ప్రజల నుంచి వినతులు వచ్చాయన్నారు. బుధవారం అధికారులతో సమావేశమవుతామన్నారు. అన్నింటినీ అధ్యయనం చేసి సుప్రీంకోర్టుకు నివేదిస్తామన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణకాండను నిలిపివేయాలి

ప్రపంచ శాంతిని కాపాడాలి

పాలస్తీనాకు సంఘీభావంగా వామపక్షాల ఆందోళన



నినదిస్తున్న వామపక్ష నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - ఏలూరుఅర్బన్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణకాండను తక్షణమే నిలుపుదల చేయాలని, అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, ప్రపంచ శాంతిని కాపాడాలని కోరుతూ మంగళవారం ఏలూరులో వామపక్షాలు పాలస్తీనా సంఘీభావ దినాన్ని పాటించాయి. వామపక్షాల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, ఎంసిపిఐ (యు) ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇజ్రాయిల్కు వ్యతిరేకంగా పాలస్తీనాకు సంఘీభావంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కెవి.రమణ, ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పాలస్తీనాపై అమెరికా ప్రోత్సాహంతో ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల వల్ల సుమారు 60 వేల మంది మరణించారని, అందులో ఎక్కువగా పిల్లలు, మహిళలు ఉండటం చాలా బాధాకరమని అన్నారు. తాజాగా ఇరాన్పైనా ఇజ్రాయిల్ దాడులకు తెగబడుతోందని, అమెరికా తన ఆయుధాలను విక్రయించుకునే పద్ధతిలోనే ఈ దాడులను ప్రోత్సహిస్తుందని వారు తెలిపారు. పాలస్తీనాపై దాడులను తక్షణమే ఆపాలని ఐక్యరాజ్య సమితి సూచించినా ఇజ్రాయిల్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్విడి.ప్రసాద్, నేతలు జివిఎల్.నరసింహారావు, వైఎస్.కనకారావు, కె.రామాంజనేయులు, ఎం.ఇస్సాక్, బి.సోమయ్య, పి.రవికుమార్, ప్రసాద్, శివ, సత్యనారాయణ, సిపిఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు, యర్రా శ్రీనివాసరావు, ఎంసిపిఐ (యు) నాయకులు జి.నాగరాజుతోపాటు వామపక్షాల నేతలు బుగ్గల ప్రభాకర్, ముంగం అప్పారావు, మంగరాజు రాము, గడసాల వెంకటరమణ, పి.నాగేశ్వరరావు, జె.రవి, వై.శ్రీను, ఎ.వెంకటేష్, టి.అప్పలరాజు, అరిగెల యోహాన్, కోరాడ అప్పారావు, నకిరెడ్డి లక్ష్మణ్, ధనాన్ని విజయ్, దుర్గారావు, నూకరాజు, సందకం అప్పారావు, అన్నవరం ఈశ్వరరావు, ఎం.శ్రీను, గోపతి, జి.గంగరాజు పాల్గొన్నారు.

బియ్యానికి పురుగులు పట్టకుండా చూడాలి

వంగూరులోని సివిల్ సప్లయీస్ గొడౌన్లో జెసి ధాత్రిరెడ్డి తనిఖీలు



బియ్యాన్ని పరిశీలిస్తున్న జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - పెదవేగి

వంగూరులోని సివిల్ సప్లయీస్ గొడౌన్ను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం జిల్లా పౌర సరఫరాల మేనేజర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజిలెన్స్ కలిసి తనిఖీలు నిర్వహించారు. ప్రజా పంపిణీ బియ్యాన్ని దిగుమతి చేసిన వెంటనే పురుగులు పట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గొడౌన్ మేనేజర్ను ఆదేశించారు. గొడౌన్లో నిల్వ ఉన్న ప్రజా పంపిణీకి సంబంధించిన బియ్యాన్ని పురుగులు పట్టకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గొడౌన్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా, గొడౌన్ అంతా పురుగురహిత ప్రాంతంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అందరు గొడౌన్ మేనేజర్లు ప్రజా పంపిణీకి సంబంధించిన బియ్యాన్ని పురుగులు పట్టకుండా సత్వరమే చర్యలు తీసుకుని ఎంఎల్ఎస్ పాయింట్లకు పురుగులు లేని బియ్యాన్ని ప్రజా పంపిణీకి సరఫరా చేయాలని ఆదేశించారు.

కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలి

ప్రజలను ఆదుకోవాలంటూ కేంద్ర సాధికారిక కమిటీకి సిపిఎం బృందం వినతి

కొల్లేరు సమస్యలను కమిటీకి నివేదించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, మండవల్లి, కాళ్ల

కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి, అక్కడి ప్రజల ఉపాధిని కాపాడి కొల్లేరు ప్రజలను ఆదుకోవాలని కేంద్ర సాధికారిక కమిటీకి సిపిఎం బృందం వినతిపత్రం అందించింది. కొల్లేరుపై అధ్యయనానికి కేంద్ర సాధికారిక కమిటీ బృందం చంద్రప్రకాష్ గోయల్, డాక్టర్ జెఆర్.భట్, జి.భానుమతి, సునీల్లిమాయి మంగళవారం కొల్లేరులో పర్యటించారు. విజయవాడ నుంచి ఏలూరు చేరుకున్న కమిటీ సభ్యులు అక్కడి నుంచి ఏలూరు జిల్లా పరిధిలో కొల్లేరు గ్రామాలైన శ్రీపర్రు, కలకుర్రు, పెద్దఎడ్లగాడ, ఆటపాక ప్రాంతాల్లో పర్యటించి కొల్లేటికోటకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన సభలో కమిటీ సభ్యులు ప్రజలు, ప్రజాసంఘాల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా సిపిఎం బృందం కొల్లేరు ప్రజలు సమస్యలపై కమిటీకి వినతిపత్రం అందించి, వివరించింది. కొల్లేరు ప్రజలకు నష్టం కల్గించే ఎకో సెన్సిటివ్ జోన్ను ఉపసంహరించుకోవాలని, కొల్లేరు ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు, అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని కోరారు. కొల్లేరును ఐదు నుండి మూడో కాంటూరుకు కుదిస్తామన్న పాలకుల హామీలు అమలు కాలేదని తెలిపారు. కొల్లేరులో 46 బెడ్ గ్రామాలు, 74 బెల్ట్ గ్రామాల్లో మూడు లక్షల మంది మత్స్యకారులు, దళితులు ఉన్నారని వివరించారు. 1975-76 కాలంలో అప్పటి వెంగళరావు ప్రభుత్వం 146 సొసైటీలు ఏర్పాటు చేసి 7,100 ఎకరాల్లో చేపల చెరువులు తవ్వించారని గుర్తు చేశారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో ఐదో కాంటూరు లోపల ఉన్న వేలాది ఎకరాల్లోని చెరువులన్నింటినీ ధ్వంసం చేసి లక్షలాది మంది కొల్లేరు ప్రజల జీవనాన్ని నాశనం చేశారన్నారు. ఐదో కాంటూరు పరిధిలో 77,138 ఎకరాల చెరువులు ధ్వంసం పేరుతో 86 వేల ఎకరాలకుపైగా చెరువులను ధ్వంసం చేశారని తెలిపారు. 7,100 ఎకరాల సొసైటీ చెరువులు, 14,800 ఎకరాల్లో జిరాయితీ భూముల చెరువులను ధ్వంసం చేశారని వివరించారు. కొల్లేరులోని వేలాది మంది ప్రజలు పొట్ట నింపుకునేందుకు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లారని, వెళ్తున్నారని తెలిపారు. మిగిలిన కొద్దిమంది ప్రజలూ ప్రతిరోజూ వందలాది కిలోమీటర్లు ఉపాధి కోసం వెళ్తొస్తున్నారన్నారు. 120 జిఒ ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షిస్తామనే పేరుతో కొల్లేరును ధ్వంసం చేయడమే దీనికి కారణమని వివరించారు. అయితే పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత నుంచి పూర్తిగా వైదొలిగారని, ఆనాడు ప్రభుత్వం ఇచ్చిన హామీలేవీ నేటికీ అమలు కాలేదని తెలిపారు. కొల్లేరులో రెగ్యులేటర్లు నిర్మిస్తామని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఉపాధి కల్పిస్తామని చెప్పారని, కోట్లాది రూపాయల నిధులు విడుదల చేశారని, ఆ నిధులతో ఒక్కరికైనా ఉపాధి కల్పించిన పరిస్థితి లేదని తెలిపారు. ఈ పరిస్థితుల్లో 15 వేల ఎకరాల్లో గట్లు వేసుకుని కొన్ని చెరువులను కొల్లేరు ప్రజలు సాగు చేసుకుంటున్నారని, మిగిలిన కొల్లేరు తుమ్మ చెట్లు, కిక్కిసతో నిండిపోవడంతో చేపల వేటకు వెళ్లే పరిస్థితి లేదని వివరించారు. ఫారెస్ట్ అధికారుల వేధింపులు, లంచాలు పెరిగిపోయి కొల్లేరు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొల్లేరు ప్రజల ఉపాధికి నష్టం కలిగించేలా కొంతమంది పర్యావరణం పేరుతో సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు సాగులో ఉన్న 15 వేల ఎకరాల చెరువులు ధ్వంసం చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. అయితే ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కాకపోవడం వల్ల సుప్రీంకోర్టు ఏకపక్షంగా తీర్పునిచ్చిందని వివరించారు. చెరువులు పూర్తిగా ధ్వంసం చేశారని, కొల్లేరు ప్రజల ప్రస్తుత సమస్యలు పరిష్కరించడం మాని, కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడో కాంటూరుకు కుదింపును పక్కనబెట్టి, ఐదో కాంటూరు నుండి పది కిలోమీటర్ల వరకూ సున్నిత పర్యావరణ ప్రాంతం పేరుతో 26 నిబంధనలను పెట్టి కొల్లేరు మొత్తాన్ని అష్టదిగ్బంధనం చేసి పూర్తిగా ఫారెస్ట్ డిపార్ట్మెంట్ చేతుల్లో పెట్టబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాలో కొల్లేటి ప్రాంతమైన నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు, పెదపాడు, మండవల్లి, కైకలూరు, ఆకివీడు మండలాలలోని 89 గ్రామాలపై ఈ ప్రభావం పడనుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మరోసారి సున్నిత పర్యావరణ ప్రదేశం పేరుతో ఐదో కాంటూరుపైన పది కిలోమీటర్ల వరకు ఎలాంటి అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టరాదని, కనీసం కట్టెల పొయ్యి కూడా వెలిగించడానికి వీలులేదని, ఇప్పటికే ఉన్న పరిశ్రమలు మినహా ఆ పరిశ్రమలను విస్తరించుకోవడానికిగాని, కొత్త పరిశ్రమలు పెట్టడానికిగాని, భూగర్భ జలాలు వాడుకోవడానికిగాని ఎలాంటి అనుమతులు ఉండవని తెలిపారు. ఇలాంటి దారుణమైన 26 నిబంధనలను పెట్టి కొల్లేరు చుట్టుపక్కల 89 గ్రామాల్లోని లక్షలాది మంది ప్రజల పొట్ట కొట్టే నిర్ణయాన్ని తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో అధికారులు తూతూమంత్రంగా అభిప్రాయాలు సేకరించి నివేదికలు పంపించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తర్వాత గ్రామసభల నివేదిక ద్వారానే హద్దులు నిర్ణయిస్తామని చెబుతున్నారని, లైడార్ సర్వే జరిపారని, ఎకో సెన్సిటివ్ జోన్పై ప్రజలకు వాస్తవాలు చెప్పాలని కోరారు. సిపిఎం బృందంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, డిఎన్విడి.ప్రసాద్ ఉన్నారు.

కొనసాగిన డిఎస్సి పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ నియామక పరీక్షలు (మెగా డిఎస్సి)- 2025 మంగళవారం ఏలూరులో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 186 మందికి 183 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 147 మందికి 140 మంది హాజరవ్వగా ఏడుగురు గైర్హాజరయ్యారు. సిఆర్రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు మొత్తం 210 మందికి 206 మంది హాజరయ్యారు. నలు గురు గైర్హాజరయ్యారు. మొత్తం మూడు కేంద్రాల్లో 543 మందికి 529 మంది హాజరవ్వగా, 14 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 5 గంటల వరకు సిద్ధార్థ క్వెస్ట్లో 180 మందికి 168 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజర య్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 140 మందికి 136 మంది హాజరవ్వగా, నలుగురు గైర్హాజరయ్యారు. సిఆర్రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షలకు మొత్తం 200 మందికి 187 మంది హాజరవ్వగా, 13 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మూడు కేంద్రాల్లో 520 మందికి 491 మంది హాజరవ్వగా, 29 మంది గైర్హాజరయ్యారు.

27న జిల్లాలో షర్మిల పర్యటన




ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఈ నెల 27వ తేదీన ఏలూరు జిల్లాలో పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్రావు తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు, అనుబంధ సంస్థల ఛైర్మన్లు, సీనియర్ నాయకులతో చర్చించి పలు సూచనలు, సలహాలను స్వీకరిస్తారని తెలిపారు. షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిసిసి జనరల్ సెక్రటరీ గౌత సత్యేంద్ర, చింతలపూడి నియోజకవర్గ ఇన్ఛార్జి ఉన్నమట్ల ఎలిజా, నూజివీడు నియోజకవర్గ ఇన్ఛార్జి మరీదు కృష్ణ పాల్గొన్నారు.

మైదాన ప్రాంత ఉద్యోగులను ఏజెన్సీలోకి రానీయొద్దు

ఐటిడిఎ పిఒకు ఆదివాసీ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వినతి



వినతి అందిస్తున్న వెంకటేశ్వరరావు, రాములుదొర

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బదిలీలు, ప్రమోషన్ల పేరుతో ఏజెన్సీలోకి మైదాన ప్రాంత ఉద్యోగులు రాకుండా అడ్డుకోవాలని ఆదివాసీ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు సున్నం శ్రీరాములుదొర డిమాండ్ చేశారు. ఈ మేరకు కెఆర్.పురం ఐటిడిఎ కార్యాలయంలో ఐటిడిఎ పిఒ రాములు నాయక్ను మంగళవారం కలిసి సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, రాములుదొర మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో ఏజెన్సీ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగోన్నతులు, బదిలీలు అంటూ ఏజెన్సీ ప్రాంతంలోకి మైదాన ప్రాంత ఉద్యోగులను పంపించే ప్రయత్నం జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రతి ఉద్యోగి గమనించి తీవ్రంగా వ్యతిరేకించాలని చెప్పారు. మైదాన ప్రాంత ఉద్యోగులు ఏజెన్సీకి వస్తే ఏజెన్సీ ఉద్యోగులు మైదాన ప్రాంతాలకు పోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే ఏజెన్సీ వ్యాప్తంగా చాలా చోట్ల మైదాన ప్రాంత ఉద్యోగులకు జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చారని తెలిసిందన్నారు. అంతేకాకుండా జూమ్ మీట్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారని, ఏజెన్సీలో సిగ్నల్, విద్యుత్ సమస్యల వల్ల ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొన్నారు. అధికారులు ఆలోచించి ప్రత్యేక కౌన్సెలింగ్ విధానాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం ఈ విషయాలపై ఒకసారి ఆలోచన చేయాలని కోరారు. మైదాన ప్రాంత ఉద్యోగులు ఏజెన్సీకి వస్తే వారిని వెనక్కి పంపించడానికి త్వరలో తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యమానికి సిద్ధం అవుతున్నట్లు తెలిపారు.

వరి విత్తన దుకాణదారుల దోపిడీ

వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు


ప్రజాశక్తి - చింతలపూడి

వరి విత్తనాలు, పురుగు మందుల దుకాణాల వారు దోపిడీ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. 'మా షాపులో రేటు ఇంతే తీసుకో, లేకపోతే వెళ్లిపో' అని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1318 వరి రకం విత్తనాలను చింతలపూడిలోని దుకాణాల్లో రూ.1050 నుంచి రూ.1150 విక్రయిస్తున్నారని, 25 కేజీల వరి విత్తనాల బస్తాకు వంద రూపాయలు అదనంగా దండుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. ఒక్కో దుకాణంలో, ఒక్కో ధర ఉంటుంటుందని వాపోతున్నారు. ఎవరకి నచ్చిన ధరలకు వారు అమ్ముతున్నారని, ఇదేమిటని అడిగితే తీసుకో లేకపోతే వెళ్లిపో అని అంటున్నారని ఆవేదన చెందుతున్నారు. ధరల్లో నియంత్రణ లేకపోవటంతో తమకు ఇబ్బందులు తప్పడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వ్యవసాయాధికారులు ఉన్నా సరే విత్తనాల దుకాణ యజమానులు ఇష్టానుసారంగా అమ్ముతున్న పరిస్థితి నెలకొంది. వ్యవసాయాధికారులు వరి విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీ చేసి ధరల వ్యత్యాసాలను అరికట్టాలని, దోపిడీ చేయకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులు లెక్కలు, ఆంగ్లంపై పట్టు సాధించాలి

ఆ విధంగా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలి

తాళ్లగూడెం ఎంపిపి పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన జెసి



అంగన్వాడీ చిన్నారులతో జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - దెందులూరు

పెదపాడు మండలంలోని తాళ్లగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద పిల్లలందరూ కూడా నాణ్యమైన విద్య ద్వారా అభివృద్ధి పథంలోకి రావాలన్నారు. లెక్కలు, ఆంగ్లంపై పట్టు సాధించే విధంగా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని కోరారు. విద్యార్థులను పాఠ్యాంశాలపై వివిధ ప్రశ్నలు అడిగి కాసేపు వారితో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల రూపురేఖలు మార్చిన జెసిని చిన్నారులు పుష్పగుచ్ఛంతో, శాలువాతో సత్కరించారు. అంగన్వాడీ విద్యార్థులతో ముచ్చటించారు. ఎంఇఒ నరసింహమూర్తి మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ దత్తత చేసు కున్న ఈ పాఠశాలను రూ.లక్షలు వెచ్చించి అభి వృద్ధి చేశారన్నారు. మౌలిక వసతులైన తాగునీరు, టాయిలెట్స్ను పున:నిర్మించారన్నారు. పాఠశాల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

జంగారెడ్డిగూడెం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్



మాట్లాడుతున్న పీర్ అహ్మద్ఖాన్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విధి నిర్వహణలో విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జంగారెడ్డిగూడెం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సబ్స్టేషన్లో విద్యుత్ శాఖ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పని చేస్తున్న సిబ్బంది విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. సేఫ్టీ నిబంధనలు పాటించాలని చెప్పారు. విద్యుత్ బిల్లుల మొండి బకాయిలను వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా డీ లిస్ట్పై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్, ఎఇ నాగశేషు, జెఇలు, ఎల్ఐలు, లైన్మెన్లు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అల్లూరు జెడ్‌పి హైస్కూలులో విద్యార్థులకు మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రామోజీ, విద్యా కమిటీ ఛైర్మన్ శీలం వెంకట శ్యామల, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు చేతులమీదుగా విద్యార్థులకు పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాసాని బాలయేసు, బొమ్మనబోయిన వెంకటరత్నం, పంతగాని నాగశ్రీనివాస్, తోట నాగరాజు, పత్తి శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మహిళల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి శక్తి యాప్‌ను రూపొందించి వారికి ఆపద సమయంలో సహాయ సహకారాలు అందిస్తుందని ఏలూరు శక్తి ఇన్‌ఛార్జి సిఐ సుబ్బారావు అన్నారు. నగరంలోని సత్రంపాడులో ఉన్న శ్రీ సాయి శ్రీ పారామెడికల్ కళాశాలలో మహిళల భద్రతపై మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని శక్తి టీమ్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా విద్యార్థినులకు శక్తి అప్‌పై అవగాహన కల్పించారు. కొన్ని సందర్భాల్లో 112 నెంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా పోలీసు సహాయ సహకారాలను పొందవచ్చని తెలిపారు. సైబర్ నేరానికి గురైతే 1930 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

ఆప్కాబ్ ఛైర్మన్‌ను కలిసిన వీరమల్లు బ్రదర్స్

ప్రజాశక్తి -ముదినేపల్లి

విజయవాడలోని ఆప్కాబ్ కార్యాలయంలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులును ముదినేపల్లి మండలానికి చెందిన వీరమల్లు బ్రదర్స్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, టిడిపి నాయకులు వీరమల్లు సత్యనారాయణ, ఊటుకూరుకు చెందిన నీటి సంఘం అధ్యక్షులు పోసిన పాండురంగారావు, తదితరులు గన్ని వీరాంజనేయులును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లలు వ్యాయామం చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాల గల పిల్లలు ప్రతిరోజు వ్యాయామం చేస్తే మానసిక ఆరోగ్యకరంగా ఉంటారని ఫిజియోథెరఫిస్టు జి.ప్రశాంతి అన్నారు. మండలంలోని రమణక్కపేట ఎంపిపిఎస్ మెయిన్ పాఠశాలలో ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు మంగళవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరఫిస్టు జి.ప్రశాంతి మాట్లాడుతూ నిత్యం ఉదయం పిల్లలను వారి తల్లిదండ్రులు నడిపిస్తే మానసిక ఉల్లాసం కలిగి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పి ఉపాధ్యాయులు డి.ఎంవిఎల్.నారాయణరావు, జె.నాగమల్లేశ్వరి, ప్రధానోపాధ్యాయులు పి.భాస్కరరావు, ఉపాధ్యాయులు సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని తుక్కులూరు గ్రామంలో వాహన చోదకులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ జ్యోతిబసు మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్, ఫోర్ వీలర్స్ నడిపేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. లైసెన్స్ లేనిదే వాహనం నడపడం నేరమన్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాలు వెంట ఉండాలని సూచించారు.

'తల్లికి వందనం' అర్హులందరికీ అందేలా చూడాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తల్లికి వందనం పథకంలో పలువురు తల్లులు లబ్ధి పొందేందుకు అడ్డంకిగా మారిన ఇబ్బందులపై పూర్తి అధ్యయనం చేసి, వాటిని తొలగించే అంశంపై దృష్టి సారించాలని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందితో ఎంఎల్‌ఎ చంటి జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లికి వందనం పథకం వర్తింపులో కొందరు తల్లులకు ఎదురైన సాంకేతిక సమస్యలు, ఇబ్బందులపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కొయ్యలగూడెం : అన్ని అర్హతలు ఉండి తల్లికి వందనం పథకం డబ్బులు ఖాతాల్లో పడనివారి సమస్యలను పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి టిడిపి మండలాధ్యక్షులు పారేపల్లి నరేష్ సూచించారు. మండలంలోని బయ్యన్నగూడెంలో సచివాలయ సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ తల్లికి వందనం డబ్బులు పడేలా చూడాలని, సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించాలని చెప్పారు.

తల్లుల హర్షం

కలిదిండి : తల్లికి వందనం కార్యక్రమం పట్ల మండలంలోని కొండంగిలో జనసేన కైకలూరు నియోజకవర్గ నాయకులు, సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ నల్లగోపుల వెంకట చలపతిరావు ఆధ్వర్యంలో తల్లులు హర్షం వ్యక్తం చేశారు. అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ ప్రెసిడెంట్ పొన్నాల లక్ష్మణరావు, మహిళా సొసైటీ ప్రెసిడెంట్ సొర్రా లక్ష్మిప్రియ, లీలా ప్రసాద్, నాయకులు తిరుమలశెట్టి సుబ్రహ్మణ్యం, లక్ష్మి, కొల్లాటి ప్రసాద్, పన్నాస కృష్ణ, బాబి, బస్వాని రాజ్‌కుమార్, చెన్నంశెట్టి చిన్న, జంపన అరవింద్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ గ్రామ ఉత్కర్ష అభయాన్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ధర్తీ ఆబా జనభాగిదారి అభియాన్" కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఏడు గిరిజన గ్రామాల్లో ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. దీనిలో భాగంగా జూన్ 18న అంకన్నగూడెం, 19న తాటిరామన్నగూడెం, 20న వంకవారి గూడెం, 23న తాటియాకులగూడెం, 24న టి.గంగన్నగూడెం, 25న రెడ్డిగూడెం, 26న భగత్ సింగ్ కాలనీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్పంచుల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆయా గ్రామాల్లోని గిరిజన ప్రజలు పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను పొందాలని కోరారు.

'ఏడాది పాలనలో కూటమి విఫలం'

ప్రజాశక్తి - ఉంగుటూరు

కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో వైఫల్యం చెందిందని వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు విమర్శించారు. జగనంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం పేరుతో వైసిపి ముద్రించిన పుస్తకాలను మంగళవారం ఉంగుటూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూటమి పాలకులు ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, బూత్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి యెలిశెట్టి పాపారావుబాబ్జి, మహిళా ప్రధాన కార్య దర్శి మంద జయలక్ష్మి, సర్పంచుల ఛాంబర్ మండలాధ్యక్షుడు పుత్సకాయల విష్ణు మూర్తి, ఎంపిటిసి సంఘం మండలాధ్యక్షుడు బండారు నాగరాజు, ఎంపిటిసి సభ్యులు సూరే వెంకట లక్ష్మి, ఏడుకొండలు, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు దఫదఫాలుగా విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి - చింతలపూడి

11 కెవి నాగిరెడ్డిగూడెం ఫీడర్ పరిధిలోని సుప్రీంపేట ఏరియాల్లో ఈ నెల 18వ తేదీ బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా దఫదఫాలుగా ఇవ్వనున్నట్లు జంగారెడ్డిగూడెం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

విద్యార్థులతో యోగా

నూజివీడు టౌన్ : మండలంలోని మద్దాయికుంట ఎంపియుపి పాఠశాలలో విద్యార్థులతో మంగళవారం యోగా చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో యోగా ప్రధానమైన అంశమన్నారు. యోగాతో ఎన్నో స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని సోదాహరణంగా వివరించారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి మార్గదర్శి విజయకృష్ణ హాస్పిటల్

వైద్యులు మనోజ్‌కుమార్, విజయలక్ష్మి


మనోజ్‌కుమార్


విజయలక్ష్మి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో మహిళల ఆరోగ్యానికి అంకితమైన ప్రముఖ వైద్య సంస్థ విజయకష్ణ హాస్పిటల్ అని వైద్యులు చిట్టూరి మనోజ్‌కుమార్, పడాల విజయలక్ష్మి చెప్పారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రసూతి, సంతానసాఫల్య, స్త్రీ ఆరోగ్య సమస్యల పరిష్కారానికి నమ్మకమైన చిరునామాగా ఈ హాస్పిటల్ నిలిచిందని తెలిపారు. తమ హాస్పిటల్ ప్రారంభించి సుమారు 14 నెలల అవుతుందని, తమ సారధ్యంలో విస్తృత వైద్య సేవలను అందిస్తోందని చెప్పారు. తమ హాస్పటల్‌లో ఎంతో మంది పిల్లలు లేని వారికి సంతానం కలిగినట్లు తెలి పారు. ఆసుపత్రి ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఉచితంగా కొన్ని ఆపరేషన్లు చేశామన్నారు. గర్భిణులకు నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నం చేస్తామని తెలిపారు. తమ హాస్పిటల్‌లో అన్ని రకాల వ్యాధులకు చికిత్స చేస్తామన్నారు. అన్ని రకాల ఆపరేషన్లు, లాప్రోస్కోపీ సర్జరీలు చేస్తామని తెలిపారు.

ప్రధాన సౌకర్యాలు

- స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణుల సేవలు
- సంతాన సాఫల్య చికిత్సలు (ఐయుఐ,
- ఐవిఎఫ్ కు ముందు చికిత్సలు)
- ల్యాప్రొస్కోపిక్, హిస్టరోస్కోపిక్ శస్త్రచికిత్సలు
- నార్మల్ డెలివరీకి ప్రోత్సాహం (విబిఎసి)
- డెలివరీ వేదన లేకుండా ప్రసవం
- 24/7 అందుబాటులో నత్యవసర పరిస్థితులకు ఐసియు సేవలు

పట్టణాభివృద్ధికి అన్నివిధాలా కృషి

రోడ్ల అభివృద్ధికి చర్యలు
జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరమణ

చిట్ చాట్



ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణ అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తున్నామని జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరమణ చెప్పారు. అలాగే సమస్యలను పరిష్కరిస్తూ రోడ్ల అభివృద్ధికి, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : మీరు ఎంత కాలం నుంచి జంగారెడ్డిగూడెం పట్టణంలో మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్నారు.

కమిషనర్ : నేను అక్టోబర్ 2024 నుంచి జంగారెడ్డిగూడెం పట్టణంలో మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్నాను.

ప్రశ్న : మీరు ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తర్వాత పట్టణంలో ఏవి అభివృద్ధి కార్యక్రమాలు చేశారు?

కమిషనర్ : సుమారు రూ.నాలుగు కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులు చేపట్టాం. తాగునీటి సమస్య పరిష్కారానికి 15 ఆర్థిక సంఘం నిధులు రూ.80 లక్షలతో పైపులైన్లు, బోర్లు, మోటార్ల పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న : పట్టణంలో కొన్ని ప్రధానమైన రహదారుల దుస్థితి చాలా అధ్వానంగా ఉంది. వాటిపై మీ స్పందన ఏమిటి?

కమిషనర్ : కొన్ని రోడ్లు ఆర్అండ్‌బి వారి పరిధిలో ఉన్నాయి. వాటిని వారు త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. సుబ్బంపేట రోడ్డు పనులు 15వ ఫైనాన్స్ ఆర్థిక సంఘం నిధులు రూ.69 లక్షలతో ప్రారంభిస్తున్నాం. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రభుత్వ కళాశాల రోడ్డు అంటే హైవే వరకు రూ.1.40 కోట్లతో జులై నెలాఖరు లోపు పనులు పూర్తవుతాయి.

ప్రశ్న : పట్టణంలో డంపింగ్ యార్డ్ లేకపోవడంతో ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి?

కమిషనర్ : డంపింగ్ యార్డ్ కోసం గతంలో తహశీల్దార్ బుట్టాయగూడెం రోడ్డులో 12 ఎకరాల భూమిని కేటాయించారు. కాని అక్కడ ఉన్న ప్రజలు ఆ భూములను ప్రభుత్వం ఎప్పుడో వారికి కేటాయించిందని కోర్టుకెళ్లారు. అది ప్రస్తుతం కోర్టులో నడుస్తుంది.

ప్రశ్న: గతంలో ఒక అపార్ట్‌మెంట్‌లో మార్ట్‌గేజ్‌లో ఉన్న రెండు ఫాట్లు మీకు తెలియకుండా రిజిస్ట్రేషన్ జరిగాయన్నారు. దీనిపై మీ స్పందన ఏమిటి?

కమిషనర్ : అది నిజమే. ఆ అపార్ట్‌మెంట్‌లో నాలుగు ఫ్లాట్లు ఉన్నాయి. మార్ట్‌గేజ్‌లో కాని రెండు ఫ్లాట్లు మాకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేశారు. దానిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ఆ బిల్డర్‌పై, కాంట్రాక్టర్‌పై కేసు పెట్టాం. వారికి నోటీసులు కూడా పంపించాం.

ప్రశ్న : మీరు వచ్చిన తర్వాత అనుమతులు లేకుండా భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మించారా?

కమిషనర్ : నేను వచ్చిన తర్వాత అనుమతులు లేకుండా అలాంటివి ఏవి నిర్మించలేదు. గతంలో కొన్ని భవనాలు మున్సిపాలిటీకి ఇచ్చిన ప్లాన్ ప్రకారం కాకుండా మరో రకంగా కట్టారు. అటువంటి 54 భవనాలకు నోటీసులు ఇచ్చాం.

ప్రశ్న : మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికులందరికీ వేతనాలు సరైన సమయంలో ఇస్తున్నారా?

కమిషనర్ : గత నెల వరకు పెండింగ్ ఉన్నాయి. ఈ నెల మొత్తం క్లియర్ చేశాం. ప్రస్తుతానికి మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు వేతనాలు క్లియర్ చేశాం.

ప్రశ్న : ఏలూరు రోడ్డులో గత 15 ఏళ్ల నుంచి కూడా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవస్తంగా ఉండడంపై మీ స్పందన ఏమిటి?

కమిషనర్ : ఆ సమస్య మా దృష్టిలో ఉంది. ఆ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం.

ప్రశ్న : మీరు పట్టణంలో ఇంకా ఏవి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలనుకుంటున్నారు?

కమిషనర్ : పట్టణంలో కొన్ని లేఅవుట్‌లలో మున్సిపాలిటీకి ఇచ్చిన పది శాతం ల్యాండింగ్ భూముల్లో రూ.25 లక్షలతో పార్కులను అభివృద్ధి చేస్తాం.

ప్రశ్న : పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై మీ అభిప్రాయం ఏమిటి?

కమిషనర్ : పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం పాటించనివారికి జరిమానాలు విధిస్తున్నాం. ప్లాస్టిక్ కవర్లు విక్రయించే షాపుల వారికి రూ.మూడు వేలు జరిమానా జరిమానా విధిస్తున్నాం.

ప్రశ్న: పట్టణాన్ని అభివృద్ధి బాటలో ఏవిధంగా నడిపిస్తారు?

కమిషనర్: నిజాయితీగా జంగారెడ్డిగూడెం పట్టణాభివృద్ధికి పాటు పడతాను. మున్సిపాలిటీకి వచ్చే పన్నుల ద్వారా, ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల ద్వారా అభివృద్ధికి కృషి చేస్తాను.

రైతులందరూ వరి సాగుకు సమాయత్తం కావాలి

పలుచోట్ల 'పొలంబడి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులందరూ సార్వా, వరి సాగుకు సమాయత్తం కావాలని మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. ఈ నెల 20వ తేదీన అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. మండలంలోని సింగరాయపాలెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సకాలంలో వర్షాలు కురుస్తున్నందున అదునులో విత్తనాలు వేసుకోవాలని సూచించారు. వరి నారుమడి పెంపకంలోని మెళకువలను రైతులకు వివరించారు. ఒక ఎకరా ప్రధాన పొలానికి సంబంధించి ఐదు సెంట్లలో నారుమడి సరిపోతుందని, దమ్ములో ఐదు సెంట్ల నారుమడికి 12 కిలోల సూపర్ ఫాస్ఫేట్ వేసుకోవాలని, తదుపరి పది రోజులకు మూడు కేజీల యూరియా, మూడు కేజీల పొటాష్ వేసుకోవాలని సూచించారు. మండవల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి మాట్లాడుతూ కౌలు రైతులందరూ విధిగా కౌలు రైతు కార్డులను తీసుకోవాలని చెప్పారు.

చింతలపూడి : రైతులు అన్నదాత సుఖీభవ పథకం పొందాలంటే రైతు సేవా కేంద్రాల్లో సకాలంలో ఇ కెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని రాఘవపురం, గణిజెర్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు బాసటగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం పొందాలంటే తప్పనిసరిగా ఇ కెవైసి చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ నరేంద్రసింగ్‌కు ఘన సత్కారం


నరేంద్రసింగ్‌ను సత్కరిస్తున్న ఎపిడబ్ల్యూజెఎఫ్ సభ్యులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నేటితరం యువతకు ప్రముఖ వైద్యులు నరేంద్ర సింగ్ జీవితం ఆదర్శనీయమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నీలా వన వెంకటేశ్వర్లు (వెంకట్) అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు పరిసర ప్రాంత ప్రజానీకానికి సుమారు 25 ఏళ్ల పాటు మెరుగైన వైద్య సేవలందించి పేదల పాలిట దైవంగా నిలిచిన వైద్యునిగా నరేంద్ర సింగ్ సేవలు ప్రశంసనీయమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అర్ధరాత్రి, తెల్లవారుజాము అనే తేడా లేకుండా ఏ క్షణమైనా స్పందించి సకాలంలో వైద్య సేవలందించడం ద్వారా పేదల ప్రాణాలకు భరోసా కల్పించిన డాక్టర్ నరేంద్ర సింగ్ నేటి యువ వైద్యులకు, అన్ని రంగాల్లోని యువతరానికి ఆదర్శనీయం, ఆచరణీయ మన్నారు. విధి నిర్వహణలో భాగంగా బదిలీ అనివార్యమై గుంటూరు జిల్లా తెనాలిలోని జిల్లా ప్రభుత్వాసుపత్రికి డాక్టర్ నరేంద్ర సింగ్ బదిలీ కావడం పేదలకు ఒకింత బాధ కలిగిస్తుందన్నారు. డాక్టర్ నరేంద్ర సింగ్ వైద్య సేవలకు ఎన్నో జిల్లా, రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయన్నారు. సన్మాన గ్రహీత డాక్టర్ నరేంద్రసింగ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వైద్య సేవలందిస్తున్న తరుణంలో అన్ని తరగతుల ప్రజల సహకారం మరువలేనిదన్నారు. అందరికంటే పాత్రికేయులు తనను మంచి మిత్రునిగా భావించి అన్నివేళలా సహాయ సహకారాలు అందించటం ఎప్పటికీ తీపి గుర్తుగా మిగిలిపోతుందని వివరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో జర్నలిస్టులు అలీ అబ్బాస్, రుప్ప రామ్మోహన్‌రావు, మల్లి కుమార్, అలెన్, తిరివీధి కృష్ణ పాల్గొన్నారు.

క్రిమిసంహారక మందు పిచికారీ

చాట్రాయి : వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చిన్నంపేట, చీపురుగూడెం గ్రామాల్లో దోమల లార్వా నిర్మూలనకు డ్రెయినేజీలు ఇతర నీటి నిల్వ గుంటల్లోనూ క్రిమిసంహారిక మందు మంగళవారం పిచికారీ చేసినట్లు చాట్రాయి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, డాక్టర్ బి.దుర్గాప్రసాద్ తెలిపారు. వర్షాకాలం కారణంగా డ్రెయినేజీలు, నీటి నిల్వ గుంటల్లోనూ నీరు చేరి దోమలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఇళ్లలోని చెత్తా చెదారాలను డ్రెయినేజీల్లో వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంట్లోని కూలర్లు, ఫ్రిజ్‌ల వెనుక భాగంలోనూ ఉండే నీటిని వారానికి ఒకసారి తీసివేయాలన్నారు. తద్వారా దోమల వృద్ధి తగ్గి డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుగూడెం, చిన్నంపేట సర్పంచులు ఓబులనేని వెంకటేశ్వరరావు, పరసా ధనలక్ష్మి, డాక్టర్ బి.దుర్గాప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి పివి.శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్ టి.సత్యవాణి, చిన్నంపేట పంచాయతీ కార్యదర్శి పార్థసారధి, హెల్త్ అసిస్టెంట్ జయబాబు, ఎఎన్ఎంలు జగన్, మౌనిక, ఆశాలు పాల్గొన్నారు.

ఉద్యోగంలో నుంచి తీసేశారని
మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి
ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీ వేధింపులే కారణమని
మృతుని తల్లిదండ్రులు, బంధువుల ఆవేదన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉద్యోగంలో నుంచి తీసేశారని మనస్తాపానికి గురైన యువకుడు పురుగుల మందు తాడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. కీర్తన ఫైనాన్స్ కంపెనీ ఉన్నత ఉద్యోగులు మాటలతో మానసికంగా వేధించడం వల్ల తమ కుమారుడు మృతి చెందాడని, వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మృతుని తల్లిదండ్రులు, బంధువులు కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన యువకుడు బంటుపల్లి గణేష్ (25) పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలంలోని కీర్తన ఫైనాన్స్ కంపెనీలో సుమారు ఏడు నెలల రికవరీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 29, 30 తేదీల్లో సెలవు తీసుకుని తిరిగి 31వ తేదీన కంపెనీకి వెళ్లాడు. ఉద్యోగంలో నుంచి తీసేశామని చెప్పడంతో మనస్తాపానికి గురైన గణేష్ ఆత్మహత్యకు పాల్పడాలని నిర్ణయించుకుని మరుసటిరోజు జూన్ ఒకటో తేదీన పెంటపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పురుగుల మందు తాగాడు. అనంతరం ఈ విషయాన్ని గణేష్ లక్కవరంలో తన స్నేహితుడికి ఫోన్ చేసి చెప్పాడు. స్నేహితుడి ద్వారా సమాచారం తెలుసుకున్న గణేష్ కుటుంబసభ్యులు, బంధువులు ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్‌మూర్తికి విషయం తెలిపారు. శ్రీనివాస్‌మూర్తి సంఘటన స్థలానికి వెళ్లి గణేష్‌ను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు రాజానగరం జిఎస్ఎల్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటినుంచి అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతి చెందాడు.

'ఫైనాన్స్ కంపెనీ వేధింపులే కారణం'

కీర్తన ఫైనాన్స్ కంపెనీలో ఉన్నత ఉద్యోగుల వేధింపుల కారణంగానే తమ కుమారుడు మృతి చెందాడని, మృతుని బంధువులు ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగంలో నుంచి తీసేశామని చెప్పడమే కాకుండా మాటలతో మానసికంగా వేధించారని, దీంతో తమ కుమారుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృతి చెందాడని వాపోయారు. గణేష్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి కారణమైన ఫైనాన్స్ కంపెనీ ఉన్నత ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పెంటపాడు పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల మూడో తేదీన ఫిర్యాదు చేశామని తెలిపారు. తమకు సంబంధం లేదని కంపెనీ వారు చేతులు దులుపుకున్నారని, పెంటపాడు పోలీసులు వారితో మాట్లాడినా వారిలో చలనం లేదని వాపోయారు. తమ కుమారుడి మృతికి కారణమైనవారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని తల్లిదండ్రులు, మృతుని బంధువులు కోరుతున్నారు.

నేడు జీలకర్రగూడెం, గుంటుపల్లి బౌద్ధరామంలో యోగాంధ్ర

ప్రజాశక్తి - ఏలూరు

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జూన్ 18వ తేదీ సోమవారం కామవరపుకోట మండలం జీలకర్రగూడెం, గుంటుపల్లి బౌద్ధరామాల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి వివిధ అంశాలపై సంబంధిత శాఖల అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో జెసి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన గుంటుపల్లి బౌద్ధరామంలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.